RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్రిక్తత

నెల్లూరు,నెల్లూరు కార్పోరేషన్ కార్యాలయంలో గురువారం ఉద్రిక్తత నెలకింది. కార్పొరేషన్ లో భవన నిర్మాణాలకు సంబంధించి ఆర్జీలను మంత్రి మంత్రి నారాయణ స్వీకరిస్తున్నారు. ఆ సమయంలో కార్పొరేటర్లు, కార్యకర్తలతో కలిసి కార్పొరేషన్ కార్యాలయానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేరుకున్నారు. ఎమ్మెల్యే లోపలికి వెళుతుండగా చెయ్యి అడ్డుపెట్టి పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ఒక్కరే లోపలికి వెళ్లాలని, కార్పొరేటర్లు, కార్యకర్తలను తీసుకెళ్లద్దంటూ పోలీసులు అడ్డుకున్నారు. తనకోసం కష్టపడ్డ కార్యకర్తలను ఎందుకు లోపలికి రానివ్వరంటూ పోలీసులపై ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆగ్రహం వహించారు.కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులకు కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. తరువాత శ్రీధర్ రెడ్డి కలుగజేసుకుని కార్యకర్తలను బయటకు పంపించారు. దాంతో వివాదం సద్దుమణిగింది.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిటి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386    85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 88    శుక్రవారం 02-08-2024    పేజీలు :04    వెల:రూ.2.00

# ఎస్సీవర్గీకరణను స్వాగతిస్తున్నాం



సుప్రీం తీర్పుతో సామాజిక న్యాయం గెలిచింది
టిడిపి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంది
రాయలసీమను రతనాల సీమగా మారుస్తా
సాగునీటి సమస్యలు లేకుండా సంపద సృష్టిస్తా
శ్రీశైలం పర్యటనలో ఏపి సిఎం చంద్రబాబు వెల్లడి
స్వామి అమ్మవార్లను దర్శించుకున్న చంద్రబాబు
కృష్ణమ్మకు జలహారతి పట్టిన సిఎం



నంద్యాల,ఆగస్ట్1(ఆర్ఎన్ఎ): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సమర్థించింది. సామాజిక న్యాయం టీడీపీ సిద్ధాంతం. 2024 ఎన్నికల్లో టికెట్ల విషయంలో సామాజిక న్యాయం పాటించాం. ఈ ప్రభుత్వం అందరిది. అందరికీ న్యాయం జరగాలి. జీరో పావర్టీ కింద ఉన్నపేదలను పైకి తీసుకు రావడమే నా లక్ష్యం. రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. దోచుకోవడం, దాచుకోవడం, విధ్వంసం చేయడం వైసీపీ నైజం. రెండు నెలల్లో ఏమి చేశారని వైసీపీ అంటోంది. నేనేమి చేశానో ప్రజలకు తెలుసు. సిద్దేశ్వరం దగ్గర కృష్ణానదిపై బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నీటి సమస్య పరిష్కరిస్తా అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా సున్నిపెంటలో నిర్వహించిన 'మన నీరు-మన సంపద' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం తీర్పుపై స్పందించారు. సామాజిక న్యాయం, దామాషా ప్రకారం ప్రతి వర్గానికి న్యాయం చేయడం తెదేపా సిద్ధాంతం. గతంలో వర్గీకరణకు సంబంధించి ఏబీసీడీలుగా కేటగిరీ తీసుకొచ్చాను. అందరికీ న్యాయం జరగాలి. ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు కూడా అలాగే చేశాం. ఈ ప్రభుత్వం అందరిది.. మీ అందరివాడిగా ఉంటా అని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని సీఎం విమర్శించారు. ప్రాజెక్టులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత తనదని చెప్పారు. సంపద సృష్టితో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శ్రీశైలాన్ని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం నాడు శ్రీశైలంలో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా సున్నిపెంటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం ప్రసంగించారు. ఏపీకి మంచి రోజులొచ్చాయని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు మంచిగా ఉండాలని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని కోరుకున్నానని చెప్పారు. జూలైలోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండటం, జల హారతి ఇవ్వడం సంతోషమని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఎన్టీఆర్ కల అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. రాయలసీమకు నీళ్లు ఇచ్చిన తర్వాతనే తెలుగు గంగ నుంచి చెన్నైకి నీళ్లు తీసుకెళ్లాలని దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చెప్పారని గుర్తుచేశారు. రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాను. కానీ మాజీ సీఎం జగన్ కేవలం రూ. 2వేల 11 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. జగన్ పాలనలో జనం భయంతో బతికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జనం స్వేచ్ఛగా ఉన్నారు. ఎన్నికల్లో చాలా హామీలు ఇచ్చాను. కానీ ఖజానా ఖాళీ అయింది. మరో రెండు, మూడు రోజుల్లో నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండుతాయి. వరద నీరు సముద్రంలో కలవకుండా ప్రాజెక్టులకు తరలించేలా ప్రణాళికలు రూపొందించి రాయలసీమను రత్నాల సీమ చేస్తా.. ఇది సాధ్యం అవుతుందని అనినారు. వైసీపీ పాలనలో రాయలసీమ రాళ్ల సీమగా మారింది. నీరు ఉంటే సంపద సృష్టిస్తాం. సంపద ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దీని వల్ల పేదరికం పోతుంది. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు.

శ్రీశైలం మండలం యువత అమెరికాలో ఉద్యోగం పొందేలా స్కిల్స్ నేర్పిస్తామని అన్నారు. అంతకు ముందు శ్రీశైలం జలాశయం వద్ద కృష్ణమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు జలహారతి ఇచ్చారు. 'ప్రాణికోటి జీవనాధారమైన జలాలను ఇచ్చే నదులని దేవతలుగా భావించి పూజించే సంస్కృతి మనది. నిండుకుండలా ఉన్న శ్రీశైలం జలాశయం వద్ద కృష్ణమ్మకు జలహారతిని ఇవ్వడం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చింది. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలు రైతుల కళ్ళలో ఆనందం నింపుతున్నాయి. ఇది రాష్ట్రానికి శుభసూచకం' అంటూ చంద్రబాబు స్పందించారు. ఈ సందర్భంగా నీటి వినియోగదారు సంఘాలతో చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు గురువారం శ్రీశైలంలో పర్యటించారు. శ్రీశైల మహాక్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున భ్రమరాంబ అమ్మవార్లను సీఎం చంద్రబాబు దర్శించుకున్నారు. శ్రీశైలాన్ని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం సున్నిపెంటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ప్రసంగించిన ఆయన.. ఏపీకి మంచి రోజులొచ్చాయని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు మంచిగా ఉండాలని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని కోరుకున్నానని తెలిపారు. జులైలోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండటం, జల హారతి ఇవ్వడం సంతోషమని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఎన్టీఆర్ కల అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. సిఎం వెంట మంత్రి ఫరూక్ తదితరులు ఉన్నారు.

## మద్యం పాలసీలో తప్పు చేస్తే ఎటువంటి శిక్షకైనా రెడీ : మాజీ మంత్రి నారాయణస్వామి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మద్యం పాలసీ లో ఎటువంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం ఆయన తిరుపతిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం పాలసీలో తాను తప్పు చేసినట్లు రుజువు చేస్తే ఎటువంటి శిక్షకైనా సిద్ధమేనని సవాల్ చేశారు.ఏపీలో కొత్త బ్రాండ్‌లన్ని చంద్రబాబే తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి నిధులు ఓర్చుకోలేక పోయారని అన్నారు. పేదవారికి న్యాయం జరిగితే సహించలేక వైసీపీ పాలనపై తప్పుడు ఆరోపణలు చేశారని, అధికారంలోకి రావడానికి అనేక అబద్ధాలు ఆడారని ఆరోపించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కులాల కార్డును ముందుకు తీసుకువచ్చి అధికారం చేపట్టారని విమర్శించారు.ఇప్పటికైనా ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే అమ్మ ఒడి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్య అందించాలని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎస్సీ,ఎస్టీ వర్గీకరణకు సుప్రీం ఆమోదం

ఉపకులాల వర్గీరణను సమర్థించిన ధర్మాసనం
రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని వెల్లడి
ఏడుగురు సభ్యుల సిజెఐ ధర్మాసనం సంచలన తీర్పు



న్యూఢిల్లీ,ఆగస్ట్1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పును వెల్లడించింది. ఎస్సీల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకే అధికారం ఉందని, వారికే అవకాశం ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం తన తీర్పులో చెప్పింది. ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో 3 రోజుల పాటు విచారణ జరిగింది. వర్గీకరణ సమర్థనీయమేనని నాడు కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. సుదీర్ఘ వాదనల తర్వాత ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు.. తాజాగా నిర్ణయాన్ని వెల్లడించింది.. విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పును వెల్లడించింది.. దీనివల్ల ఎస్సీ ఎస్టీలోని వెనుకబడిన ఉప కులాలకు లబ్ది చేకూరుతుందని అభిప్రాయపడింది. వర్గీకరణతో సమానత్వానికి భంగం వాటిల్లదని.. జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. వర్గీకరణతో ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కుకు భంగం వాటిల్లదు.. వర్గీకరణ అనేది ఆర్టికల్ 341/2కి ఉల్లంఘన కాదు .. ఆర్టికల్ 15, 16లో వర్గీకరణ వ్యతిరేకించే అంశాలూ లేవని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో క్రిమీలేయర్‌ను గుర్తించడానికి రాష్ట్రాలు.. ఒక నిర్దిష్టమైన విధానాలు తీసుకురావాలని.. జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. కాగా..వర్గీకరణపై 2 దశాబ్దాల క్రితం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కకుపెట్టింది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ఈమేరకు 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును తాజాగా విస్తృత ధర్మాసనం పక్కనబెట్టింది. 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాస నం తుది తీర్పు వెలువరించింది. తాజా తీర్పును అనుసరించి ప్రభుత్వాలు దీనిపై తదుపరి మార్గ దర్శకాలు రూపొందించుకోవాలని సూచించింది. వ్యవస్థాగతంగా ఎదుర్కొంటున్న వివక్ష కారణంగా ఎస్సీ,ఎస్టీ వర్గాల వారు పైకి రాలేక పోతున్నారు. ఒక కులంలో ఉపవర్గాలు చేసేందుకు రాజ్యాంగంలోని 14వ అధికరణ అనుమతి కల్పిస్తుంది. అందుకే 2004 నాటి ఈవీ చిన్నయ్య తీర్పును మేం వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్రాలు ఉపవర్గీకరణ చేసుకునేందుకు అనుమతి కల్పిస్తున్నాం' అని సీజేఐ ధర్మాసనం స్పష్టంచేసింది. అణగారిన వర్గాల వారికి మరిన్ని ప్రయోజ నాలు కల్పించేందుకు రిజర్వ్‌డ్ కేటగిరీలో రాష్ట్రాలు ఉప వర్గీకరణ చేసుకోవచ్చని కోర్టు వెల్లడించింది.

## విజయవంతంగా పేదలకు పెన్షన్ల పంపిణీ

రెండోనెలలోనూ సమర్థంగా పంపిణీ పూర్తి
హర్షం వ్యక్తం చేసిన పవన్, లోకేశ్

అమరావతి,ఆగస్ట్1: ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది.పింఛన్ల పంపిణీ విజయవంతంగా సాగడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన ప్రారంభమయ్యాక పెంచిన సామాజిక పింఛన్లను రెండో నెలలోనూ విజయవంతంగా లబ్దిదారులకు ఇంటి దగ్గరే పంపిణీ చేశామని అన్నారు. 64 లక్షల మందికిపైగా లబ్దిదారులకు రూ.2737.4 కోట్ల మొత్తాన్ని గురువారం ఉదయం నుంచి ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందించారని చెప్పారు. పేదల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రజలకు చేరువైందని వ్యాఖ్యానించారు. అందరూ హర్షించేలా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రికి మనస్ఫూర్తిగా అభినందనలు అని అన్నారు. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసినా సంక్షేమ పథకాల అమలుకి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఈ ప్రభుత్వం ముందుకు వెళుందని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియాకు ఆయన స్పందించారు.పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన షూటర్ స్విప్నల్ కుశాలెకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. మన దేశానికి మరో పతకం దక్కడం సంతోషాన్ని కలిగించింది. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో కాంస్యం సాధించిన యువ షూటర్ స్వప్నిల్ కుశాలెకు హృదయపూర్వక



అభినందనలు. ఈ ఒలింపిక్స్ లో మన క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా వేకువజామునే మొదలైంది. ఎమ్మెల్యేలు, అధికారులు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. విజయవంతంగా పెన్షన్ల పంపిణీపై విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఒకటో తేదీన తెల్లవారి 6 గంటలకే పెంచిన పింఛను రూ.4000 ఇంటి వద్దే అందుకున్న అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులే తమ కూటమి ప్రభుత్వానికి దీవెనలు అని అన్నారు. పింఛన్లు అందుకున్న ఒంటరి మహిళలు, దివ్యాంగులు చెబుతున్న కృతజ్ఞతలే తమకు ఆశీస్సులు అని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకున్న లక్షలాదిమంది వ్యక్తం చేసిన ఆనందమే కూటమి ప్రభుత్వానికి అందిన వెలకట్టలేని బహుమానమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం... ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని జనసేన నేత నాగబాబు అన్నారు. సంక్షేమ పథకాలు నూటికి నూరు శాతం అమలు చేస్తామని ఆయన చెప్పారు. పిఠాపురంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నాగబాబు, పీ.హరిప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ స్వయంగా వెళ్లి నాగబాబు పెన్షన్లు అందజేశారు. ఈ విషయాన్ని జనసేన పార్టీ వెల్లడించింది.

## జగన్ ప్రభుత్వంలో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం

మండిపడ్డ మంత్రి నిమ్మల రామానాయుడు

నంద్యాల,ఆగస్ట్1: జగన్ ప్రభుత్వంలో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఈ వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో అత్యధిక శాతం నిదులు కేటాయించిందని తెలిపారు. సిఎం చంద్రబాబుతో కలసి ఆయన శ్రీశైలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆంధ్రా, తెలంగాణ, రాయలసీమకు అత్యంత కీలకమైన ప్రాజెక్టు శ్రీశైలం ప్రాజెక్టు అని వివరించారు. శ్రీశైలం డ్యామ్ భద్రతకు ముప్పు ఏర్పడుతుందని గతంలో డ్యామ్ సేఫ్టీ కమిటీ నిపుణులు పాండ్యా అప్పటి ప్రభుత్వానికి తెలిపారని గుర్తుచేశారు. శ్రీశైలం డ్యామ్ ప్లంజ్ పూల్ అధ్యాయనానికి బడ్జెట్ కేటాయించాలని నిపుణులు కోరారని చెప్పారు. అయితే జగన్ ప్రభుత్వం రూ. 16 కోట్లు కేటాయించలేకపోయిందని మండిపడ్డారు. శ్రీశైలం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడమంటే రాయలసీమను నిర్లక్ష్యం చేయడమేనని అన్నారు. సోమశిల ప్రాజెక్టు యాప్రాన్ కూడా దెబ్బతిందని ఇంజనీర్లకు చెప్పామన్నారు. యాప్రన్ పనులు చేయకపోతే సోమశిల ప్రాజెక్టు భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ఆ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ వల్ల నష్టం జరగకుండా భద్రతకు చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. లచందరబాబు సిఎం కావడంతో ఏపీకి మంచి రోజులొచ్చాయని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు మంచిగా ఉండాలని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని కోరుకున్నానని చెప్పారు. రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఎన్టీఆర్ కల అని సీఎం చంద్రబాబు దానిని సాకారం చేస్తారని అన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాను. కానీ మాజీ సీఎం జగన్ కేవలం రూ. 2వేల 11 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. జగన్ పాలనలో జనం భయంతో బతికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జనం స్వేచ్ఛగా ఉన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండుతాయి. వరద నీరు సముద్రంలో కలవకుండా ప్రాజెక్టులకు తరలించేలా ప్రణాళికలు రూపొందించి రాయలసీమను రత్నాల సీమ చేస్తా.. మన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 02-08-2024

## ప్రకృతి ప్రకోపానికి బలి కాకుండా ఏమి చేయాలి...

ఈ మధ్య కాలంలో భారత్‌లో వయనాడ్ తరహా విపత్తులు తలెత్తుతూనే ఉన్నాయి. వాతావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఈ ముప్పులు వందలాది మందిని బలి తీసుకోగా ఎంతో మందిని నిరాశ్రయులను చేశాయి. వరుస పెట్టి భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లు ముంచుకొచ్చాయి. ఈ ఏడాది జూన్ నుంచే ఈ ప్రకృతి విపత్తులు మొదలయ్యాయి. వయనాడ్‌లో ఈ స్థాయిలో కొండ చరియలు విరిగి పడడానికి కారణమేంటో సైంటిస్ట్‌లు ఓ ప్రాథమిక అంచనాకు వచ్చారు. అరేబియన్ సముద్రం విపరీతంగా వేడెక్కడం వల్లే ఈ విపత్తు సంభవించిందని చెబుతున్నారు. భారీగా మేఘాలు కమ్ముకుని ఒక్కసారిగా కేరళలో కుండపోత వానలు కురిశాయని వివరిస్తున్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదు కావడానికి ఇదే కారణమని అంటున్నారు. అనూహ్య స్థాయిలో వర్షాలు కురవడం వల్ల కొండ చరియలు విరిగి పడ్డాయి. ఈ విపత్తులో ఇప్పటి వరకూ 200 మందికి పైగా మృతి చెందగా వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. శిథిలాల కింద చాలా మంది బాధితులు చిక్కుకున్నారు. దాదాపు రెండు వారాలుగా అక్కడ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఫలితంగా మట్టి బాగా మెత్తబడింది. వయనాడ్‌తో పాటు క్యాలికట్, మలప్పురం, కన్నూర్ ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది. ఈ అన్ని చోట్లా కొండ చరియలు విరిగి పడ్డాయి. 2019 సమయంలో కేరళ భారీ వరదలు ముంచెత్తాయి. ఆ సమయంలో మేఘాలు ఎలా అయితే కుండపోత కురిపించాయో ఇప్పుడూ వాతావరణ పరిస్థితి అలాగే ఉందని సైంటిస్ట్‌లు చెబుతున్నారు. అరేబియన్ సముద్రం మీద మేఘాలు కమ్ముకుంటున్నాయని, ఒక్కోసారి ఈ మేఘాలే కేరళ వైపు మళ్లి ఇలా బీభత్సం సృష్టిస్తాయని వివరించారు. అరేబియన్ సముద్రం తీవ్ర స్థాయిలో వేడెక్కుతోంది. అందుకే అక్కడి వాతావరణం పూర్తిగా మారిపోతోంది. మేఘాలు దట్టంగా అలుముకుంటున్నాయి. ఇవే మేఘాలు కేరళ వైపు వస్తున్నాయి. ఆ సమయంలోనే ఇలా కుండపోత వానలు కురుస్తున్నాయి. వాతావరణంలో ఈ స్థాయిలో మార్పులు అందుకే వస్తున్నాయి. అంతకు ముందు మంగళూరులో ఈ తరహా వర్షాలు కురిసేవి. భారత్‌లోని పశ్చిమతీరంలో అనూహ్యంగా వర్షపాతం నమోదవుతోంది. ఫలితంగానే కేరళలోని పశ్చిమ కనుమల్లో ఈ ముప్పు ముంచుకొచ్చింది"ఎఓఆ వెల్లడించిన వివరాల ప్రకారం 24 గంటల్లోనే 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరి కొన్ని చోట్ల 30 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డ్ అయింది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను మాత్రం ముందుగానే గుర్తించవచ్చు. అది ఎలా అంటే.. నిటారుగా ఉండే కొండప్రాంతాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అలాగే లోయల దిగువ భాగాల విషయంలోనూ కేర్ తీసుకోక తప్పదు. ఇక నీటిలో ఎక్కువకాలం ఉండే ప్రాంతాలపైనా కన్నేసి ఉంచాలి. కార్చిచ్చు వల్ల తగలబడిన ప్రాంతాల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. వాగు ప్రవహించే మార్గంలోను, నదీ ప్రవాహ మార్గాల్లోనూ నిర్లక్ష్యం అస్సలు పనికిరాదు. ఎగువప్రాంతాల్లో ప్రకృతి విధ్వంసం వల్ల దాని రిజల్ట్.. ఈ మార్గాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే ఇలాంటి ప్రాంతాల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. మరి కొండచరియలు విరిగిపడిన సందర్భాల్లో తప్పించుకోవడం సాధ్యం కాదా అంటే.. దీనికి సమాధానం.. అప్పుడున్న పరిస్థితులను బట్టి ఉంటుందని చెప్పాలి. ఎందుకంటే ఇలాంటి ఘటనలకు ముందు కొన్ని సంకేతాలు ఉంటాయి. రాళ్లు దొర్లుతున్న శబ్దం వింటే వెంటనే అలెర్ట్ కావాలి. అలాగే చెట్లు పడిపోయిన సౌండ్ వచ్చినా జాగ్రత్తపడాల్సిందే. మీకు సమీప ప్రాంతాల్లోని జలవనరుల్లో నీటి మట్టం అకస్మాత్తుగా పెరిగినా, తగ్గినా, ఆ నీరు బురదలా మారినా.. అది ప్రమాద సంకేతమని గుర్తించాలి. వీలైనంత త్వరగా అక్కడి నుంచి బయటపడాలి. నిపుణులు చెబుతున్న ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవడం మంచిది. గతేడాది జులైలో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో 27 మంది చనిపోయారు. మహారాష్ట్రలోనూఇదే స్థాయిలో వర్షాలు కురిశాయి. పలు పర్యాటక ప్రాంతాల్లో వరదలు రావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు అసోంలోనూ విపరీతమైన వర్షాలు కురవడం వల్ల నదులు ఉప్పొంగాయి. కొండచరియలు విరిగి పడ్డాయి. ఈ విపత్తుల వల్ల 79 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 150కి పైగా జంతువులూ నీళ్లలో పడి కొట్టుకుపోయాయి. గతేడాది డిసెంబర్‌లో దక్షిణాదిలో తుఫాన్ గట్టి ప్రభావం చూపించింది. తమిళనాడులో కురిసిన భారీ వర్షానికి 31 మంది బలి అయ్యారు. రోడ్లు జలమయం అయ్యాయి. రైల్వే పూర్తిగా నిలిచిపోయింది. కొద్ది రోజుల పాటు ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. ఈ ప్రభావం నుంచి బయట పడడానికి చాలా సమయమే పట్టింది. గతేడాది అక్టోబర్‌లో భారీ వర్షాలు కురవడం వల్ల హిమాలయాల్లో హిమానీ నదాలు ఉప్పొంగాయి. ఫలితంగా ఈశాన్య రాష్ట్రమైన సిక్కిమ్‌లో వరదలు ముంచెత్తాయి.

# జనసేనలో సీనియర్ల అసంతృప్తి




విశాఖపట్టణం, ఆగస్టు 1 ఉత్తరాంధ్రలో సీనియర్ నేత కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో ఉన్నా లేనట్లేనా? ఆయన ఎందుకు యాక్టివ్ గా లేరు. అదే ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. ఆయన దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి రాజకీయాల్లో ఉన్నారు. మచ్చలేని నేతగా గుర్తింపు ఉంది. వివాదాలకు దూరంగా ఉంటారు. కేవలం ఉత్తరాంధ్రకే పరిమితమై ఆ ప్రాంత సమస్యలనే ఎక్కువగా పట్టించుకుంటారు. నాలుగు దశాబ్దాల నుంచి రాజకీయాల్లో ఉన్నా ఆయన గెలిచింది మాత్రం మూడు సార్లు మాత్రమే. 1989, 1991 లో కాంగ్రెస్ నుంచి అనకాపల్లి పార్లమెంటుకు పోటీ చేసి విజయం సాధించారు. 2004లో అనకాపల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి మరొకసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అంతే తప్ప ఈయన రాజకీయ జీవితంలో గెలుపు కంటే ఓటములే ఎక్కువ.ఆయన కాంగ్రెస్ లో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. వైఎస్ కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడ్డారు. తర్వాత ఆయన కాంగ్రెస్ నుంచి వైసీపీలో చేరినా అక్కడా ఇమడలేకపోయారు. ఎక్కువ కాలం ఉండలేదు. విశాఖ పార్లమెంటులో వైఎస్ విజయమ్మ ఓటమి తర్వాత ఆయనను పార్టీ అధినాయకత్వం క్రమంగా దూరం పెట్టడం ప్రారంభించింది. అప్పటి నుంచి కొంత ఓపికపట్టి చివరకు పార్టీ నుంచి కొణతాల రామకృష్ణ బయటకు వచ్చేశారు. తర్వాత దశాబ్దకాలం ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. పోటీ కూడా చేయలేదు. ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తుతూ ఆయన తన ఉనికిని కాపాడుకుంటూ వచ్చారు. అన్ని పార్టీల అధినేతలను కలసి ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజకీయంగా కొంత పట్టుసంపాదించారు. ఎన్నికలకు ముందు... 2023 ఎన్నిలకు ముందు కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. అనకాపల్లి శాసనసభ సీటును సాధించుకున్నారు.కూటమి వేవ్ విపరీతంగా వీయడంతో పాటు జనసేన హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో గెలవడంతో మొన్నటి ఎన్నికల్లో ఆయన కూడా విజయం సాధించారు. అనకాపల్లి నుంచి దాదాపు మూడు దశాబ్దాల తర్వాత చట్టసభల్లోకి అడుగు పెట్టారు. సీనియర్ నేతగా ఆయన పార్టీకి సేవలందించాలనుకున్నారు. కానీ ఎందుకో ఆయన పార్టీలోనూ యాక్టివ్ గా కనిపించడం లేదు. అలాగే సీనియర్ నేతగా, మచ్చలేని నేతగా ఆయనకు కేబినెట్ లో స్థానం దక్కుతుందని అందరూ భావించారు. కానీ ఊహించని విధంగా జనసేన కోటాలో ఆయన పేరు మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయినట్లు తెలిసింది. ఖచ్చితంగా తనకు మంత్రి పదవి వస్తుందని ఆయన ఆశించారంటారు అయితే మంత్రి పదవితో పాటు పార్టీ పదవులు కూడా ఏమీ ఇవ్వకపోవడంతో కొంత పార్టీకి దూరంగానే ఉంటున్నారు. ఎన్నో ఏళ్లకు తాను ఎమ్మెల్యేగా గెలిచినా చివరకు మంత్రి పదవిరాకపోవడంతో ఆయన ఒకింత నిరాశకు గురయినట్లు సమాచారం. ఆయన సహచరులు, అనుచరులు కూడా తమనేతను పట్టించుకోవడం లేదన్న ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు. అయితే కొణతాల రామకృష్ణ మాత్రం తాను ఎమ్మెల్యేగా ఉంటూ అనకాపల్లికి మాత్రమే పరిమితమయ్యారు. రాష్ట్ర స్థాయి నేత అయినా రాజకీయాలను పట్టించుకోవడం లేదు. తన సీనియారిటీని గుర్తించలేదన్న బాధ ఆయనలో కనిపిస్తుందని ఆయనను దగ్గర నుంచి చూసిన వారు చెబుతుండటం విశేషం. మరి ఈ పెద్దాయన జనసేనలోనైనా ఇమిడి పనిచేసుకుని వెళతారా? లేదా? అన్నది మాత్రం కొంత సందేహంగానే కనిపిస్తుంది.

# కుప్పంలో వైసీపీ ఖాళీ

తిరుపతి, ఆగస్టు 1 (న్యూస్ పల్స్) ఓటమి తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీకి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. కీలక నియోజకవర్గాల్లో ఇంచార్జులు పత్తా లేకండా పోవడంతో ద్వితీయ శ్రేణి నేతలు ఇబ్బంది పడుతున్నారు. కుప్పంలో ఐదేళ్ల పాటు హవా చెలాయించి గత ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన భరత్ పార్టీని పట్టించుకోవడం లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి ఆయన కుప్పం రాలేదు. జగన్ తో పాటు ఢిల్లీ ధర్నాకు వెళ్లారు కానీ.. కుప్పంకు మాత్రం రావడం లేదు. హైదరాబాద్‌లోనే గడుపుతున్నారు. వైసీపీ హయాంలో కుప్పంలో జరిగిన అనేక అరాచకాలకు భరతే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. చంద్రబాబుపై రాళ్ల దాడితో పాటు టీడీపీ కార్యకర్తలపై దాడులు సహా ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణం టీడీపీ విజయం సాధించిన వెంటనే భరత్ కుప్పం నుంచి వెళ్లిపోయారు. ఆయన అండగా ఉంటారని భావించిన క్యాడర్ .. ఆయన కనిపించకపోవడంతో చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. చంద్రబాబుపై బాంబులేస్తామని.. లేపేస్తామని బెదిరించిన కొంత మంది నేతలు కుప్పంలో కనిపించి చాలా కాలం అయింది. ఇలా ముఖ్యనేతలంతా కుప్పం బయట అజ్ఞాతంలో ఉండటంతో.. పార్టీని పట్టించుకునేవారు లేకుండా పోయారు. తాజాగా కుప్పం నియోజకవర్గ స్థాయి కార్యాలయాన్ని వేరే హోటల్‌కు అద్దెకు ఇచ్చేశారు. ఇప్పుడు వైసీపీ కార్యాలయంలో చిన్న హోటల్ నడుపుతున్నారు. ద్వితీయ శ్రేణి నేతలు టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇతర పార్టీల నేతల్ని చేర్చుకునే విషయంలో టీడీపీ క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూండటంతో అందర్నీ చేర్చుకోవడం లేదు. తాజాగా చంద్రబాబు సమక్షంలో ఐదుగురు కుప్పం కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. మరికొంత మంది ఎంపీటీసీలు చేరారు. టీడీపీలో చేరేందుకు కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కూడా సిద్ధమయ్యారు. కానీ ఆయన అధికారంలో ఉన్నప్పు? టీడీపీ నేతలపై దాడులకు పాల్పడ్డారని ఆయనను చేర్చుకోవద్దని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆయన




ఆస్పత్రిపైనే కుప్పం టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. దాంతో చేరికల కార్యక్రమం ఆగిపోయింది. కుప్పం లో చంద్రబాబు తరుపున ఎమ్మెల్సీ శ్రీకాంత్ పార్టీ వ్యవహారాలు చక్క బెడుతున్నారు. వచ్చే కొద్ది రోజుల్లో వైసీపీ మొత్తం ఖాళీ అయిపోతుందని ఆయన చెబుతున్నారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.250 కోట్లు కేటాయించారన్నారు. హంద్రీనీవా కాలు ద్వారా వచ్చే నీటిని నిలువ చేయడానికి రూ.500 కోట్లతో రిజర్వాయర్లు నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. . కుప్పంలో 2000 ఎకరాలతో సెజ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన 40 రోజుల్లోనే కుప్పం అభివృద్ధికి చంద్రబాబు నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఎవరైతే తటస్తులుగా ఉండి కుప్పం అభివృద్ధిని కోరుకుంటున్నారో వారందరినీ టీడీపీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు.

# విశాఖ ఎమ్మెల్సీతో తొలి పరీక్ష

విశాఖపట్టణం, ఆగస్టు 1, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండు నెలలు కావస్తోంది. ఇదే సమయంలో విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు 30న జరిగే ఆ ఎన్నికతో కూటమి ప్రభుత్వం తొలి రాజకీయ పరీక్ష ఎదుర్కోబోతోంది. ఇప్పుడున్న అంకెల లెక్కల్లో ప్రతిపక్షం వైసీపీకే ఈ స్థానంలో మెజార్టీ ఉంది. కానీ, ఆ పార్టీకి గెలుపు అంత ఈజీ కాదనే విశ్లేషణలు ఉన్నాయి. అదే సమయంలో ప్రభుత్వం తన ఆధిపత్యం చెలాయించడం కూడా తేలికైన విషయం కాదు. ఈ పరిస్థితుల్లో రెండు పార్టీలకూ సవాల్ గా మారిన విశాఖ ఎమ్మెల్సీ స్థానం ఎవరి పరమవుతుందనేది రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది.విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు రూట్ క్లియర్ అయింది. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎమ్మెల్యేగా పని చేసిన వంశీకృష్ణ శ్రీనివాస్? ఎన్నికల ముందు తన పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఆ తర్వాత విశాఖ సౌత్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 841 ఓట్లు ఉన్నాయి. ఇందులో వైసీపీకి 615 ఓట్లు ఉండగా, అధికార పార్టీ టీడీపీకి కేవలం 215 ఉన్నాయి. ఈ లెక్కలు పరిశీలిస్తే ఇప్పటికీ వైసీపీకే ఆధిక్యం ఉన్నట్లే. 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ బహిష్కరించడంతో అప్పటి అధికార పక్షం వైసీపీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఫలితంగా ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకుంది. ఇప్పుడు వాస్తవ లెక్కలను పరిశీలిస్తే వైసీపీ గెలవడం ఈజీయే. కానీ, ఇక్కడే ఆ పార్టీకి అతిపెద్ద సవాల్ ఎదుర్కోంటోందంటున్నారు పరిశీలకులు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ లెక్కలన్నీ చెదిరిపోయాయంటున్నారు. ఇప్పటికే విశాఖలో పలువురు కార్పొరేటర్లు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు కొంతమంది ఎంపీటీసీలు, సర్పంచ్ లు, జడ్పీటీసీలు టీడీపీ గూటికి చేరారు. వీరంతా ఇప్పుడు టీడీపీకి అనుకూలంగా ఓటేసే అవకాశం ఉందంటున్నారు. దీంతో వైసీపీ మెజార్టీకి భారీగా గండి పడిందంటున్నారు. ఐతే ఆ పార్టీ ఓడిపోయేంత సంఖ్యలో టీడీపీలోకి వలసలు లేవని.. అందువల్ల వైసీపీయే ఈ స్థానం గెలుచుకునే అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు ఉన్నాయి. అయితే ఇప్పుడు అధికార పార్టీ గేట్లు ఎత్తితే వలసలు మరింతగా పెరిగి ఎమ్మెల్సీ స్థానం వైసీపీ చేజారిపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయంటున్నారు. అందుకే ఈ ఎన్నిక అధికార, ప్రతిపక్ష పార్టీలకు సవాల్ గా మారిందని చెబుతున్నారు.ఆగస్టు 30న జరగబోయే ఎన్నికకు ఆగస్టు 6న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచి ఆగస్టు 13 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న పరిశీలన జరుగుతుంది. పోటీ ఉంటే 30న ఎన్నిక జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నిక జరుగుతుందా? లేక ఏకగ్రీవం అవుతుందా? అన్నదే ఇంట్రెస్టింగ్ గా మారింది. వాస్తవానికి ఈ స్థానం నుంచి పోటీ చేసి మండలికి వెళ్లాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కొద్దిరోజుల నుంచి ప్లాన్ చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఐతే ఇటీవల విశాఖ కార్పొరేటర్లు వైసీపీని వీడిన తర్వాత ఆయన ఆ ఆలోచన విరమించుకున్నారనే ప్రచారం జరుగుతోంది.చేతిలో అధికారం లేకపోవడం వల్ల గెలుపు అంత ఈజీ కాదనే ఆలోచనతోనే అమర్నాథ్ వెనక్కి తగ్గారంటున్నారు. ఇక అధికార పార్టీ అభ్యర్థిగా ఎవరిని పెడుతుందనేది ఇంతవరకు క్లారిటీ లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 నియోజకవర్గాలకు 13 చోట్ల నెగ్గిన ఎన్డీఏ కూటమి గట్టిగా ఫోకస్ పెడితే ఎమ్మెల్సీ స్థానం కైవసం చేసుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయంటున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు పార్టీలు ఎలా ముందుకు వెళ్తాయనేది చూడాల్సి వుంది.

# ఏపీలో ఆరోగ్యశ్రీ పంచాయితీ

విజయవాడ, ఆగస్టు 1ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్య శ్రీ పథకాన్ని తీసేస్తారని వైసీపీతో పాటు కాంగ్రెస్ కొత్త అనుమానాలు వ్యక్తం చేస్తోంది. దీనికి కారణం కేంద్ర మంత్రి పెమ్మసాని చేసిన వ్యాఖ్యలే. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఉపయోగించుకోవాలని ఆయన గుంటూరులో పిలుపునిచ్చారు. ఆరోగ్యశ్రీ తీసేసి ఆయుష్మాన్ భారత్ ను పెడుతున్నారని విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. తాజాగా షర్మిల కూడా ఇదే అంశంపై ట్వీట్ చేశారు. ఆరోగ్య శ్రీ పథకం అమలుపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు అనుమానాలు కలిగిస్తున్నాయని.. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కార్డులు తీసుకోవాలని పెమ్మసాని అంటున్నారని అంటే ఇక ఆరోగ్యశ్రీ లేనట్టేనా అని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. కేవలం ఆయుష్మాన్ భారత్ పథకాన్నే అమలు చేయాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఆయుష్మాన్ భారత్ కింద కేంద్రం ఇచ్చే 5 లక్షలతోనే సరిపెడితే మరి రాష్ట్రం ఇచ్చేది ఏమీ లేదా.. ఆరోగ్యశ్రీ కింద ఇక వైద్యం ఉండదని చెప్పకనే చెబుతున్నారా అని షర్మిల ప్రశ్నించారు. ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకంపై వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. షర్మిల ట్వీట్‌కు కేంద్ర మంత్రి పెమ్మసని చంద్రశేఖర్ కూడా స్పందించారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోగ్యశ్రీకి ఆయుష్మాన్ భారత్ రీప్లేస్ మెంట్ కాదని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేలా.. చర్యలు తీసుకునే ప్రయత్నమేనన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం విజన్ ఏమిటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ ప్రేరేపిత తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు.పెమ్మసాని వివరణతో ఏపీలో ఆరోగ్యశ్రీకి డోకా లేదని.. స్పష్టమయిందని అంటున్నారు.

# స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల షెడ్యూల్

ఒంగోలు, ఆగస్టు 1 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో ఉన్న పేరెంట్స్ కమిటీల స్థానంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను నియమించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక ఆగస్టు 8న నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సమగ్ర శిక్ష డైరెక్టర్ డి. శ్రీనివాసరావు షెడ్యూల్ విడుదల చేశారు. 2021 సెప్టెంబర్ 22న ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను 2023 సెప్టెంబర్ 21తో రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నాయి. అయితే 2024-25 విద్యా సంవత్సరానికి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే వరకు కొనసాగించారు. ఆగస్టు 8న ఈ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని అన్ని జిల్లాల డీఈఓలు, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్స్‌కు రాష్ట్ర సమగ్ర శిక్ష డైరెక్టర్ డి. శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు. అన్ని పాఠశాల్లో (ప్రైవేట్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ మినహా) స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులు ఉంటారు. ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డులో పెట్టాలి. ఆగస్టు 5 (సోమవారం)న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటరు జాబితాపై ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఓటర్ల జాబితా పూర్తి చేసి నోటీస్ బోర్డులో పెట్టాలి.ఆగస్టు 8 (గురువారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల ఎన్నిక నిర్వహించాలి. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి ఎన్నికైన సభ్యులతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాలి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం చేయించాలి. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్య మొదటి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలి. ఎన్నికల నిర్వహించడానికి కనీసం 50 శాతం విద్యార్థులు తల్లిదండ్రులైన, సంరక్షకులైన వారు ఉండాలి. ఈ కమిటీకి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. అయితే ప్రధానోపాధ్యాయుడు ఓటు వేయడానికి అవకాశం లేదు.

# చిట్టి దోశెలతో రోజుకు 10 వేలు

అనంతపురం, ఆగస్టు 1 సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు జీతాలు లక్షల్లో ఉంటాయి. అందుకే నేటి యువత సాఫ్ట్ వేర్ ఉద్యోగాలకు ఎగబడుతుంటారు. అయితే రోడ్డు పక్కన దోసెలు అమ్ముకునే ఓ మహిళ టెక్కీలే ఆశ్చర్యపోయేలా సంపాదిస్తుంది. రోజుకు రూ.10 వేలు వ్యాపారం చేస్తామని నర్సమ్మ అంటున్నారు. ఇందులో గొప్పేంటి అనుకుంటున్నారా? రోడ్డు పక్కన చిన్న షెడ్డులో మరో ఇద్దరు కుటుంబ సభ్యులతో కాకా హోటల్ నడుపుతూ.. రోజుకు రూ.10 వేల వ్యాపారం చేస్తున్నారంటే...గొప్పే కదా అంటున్నారు స్థానికులు. ఒకరిపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన సాధించాలనుకునే వారికి నర్సమ్మ ఆదర్శమే అంటున్నారు.సత్యసాయి జిల్లాలోని కదిరికి సమీపంలోని కూటగుళ్ల గ్రామంలో నర్సమ్మ హోటల్ ఉంది. రోజుకు రూ.10 వేలు చొప్పున నెలకు దాదాపు రూ. 3 లక్షల వ్యాపారం జరుగుతుందని నర్సమ్మ తెలిపారు. కుటుంబ సభ్యుల సహకారంతో వ్యాపారం సాఫీగా సాగుతుందని అంటున్నారు. నర్సమ్మ హోటల్ లో వివిధ రకాల దోసెలు విక్రయిస్తారు. ఎగ్ దోసెలు రూ. 25 , సాధారణ దోసెలు రూ. 10 , కారం దోసెలు రూ.25 అందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు అమ్మకాలు జరుగుతాయని నర్సమ్మ తెలిపారు. రోడ్డు పక్కనే కావడంతో వాహనదారులు, ప్రయాణికులు ఈ హోటల్ కు వస్తుంటారు. నర్సమ్మ హోటల్ దోసెల రుచి తెలిసిన స్థానిక కూలీలు, చిరు వ్యాపారులు, విద్యార్థులు అక్కడకు నిత్యం వస్తుంటారు. తక్కువ ఖర్చు, రుచికి అమోఘంతో నర్సమ్మ దోసెల కోసం క్యూ కడుతుంటారు. ఈ హోటల్ లో ఎగ్ దోసె ఫేమస్ అని నర్సమ్మ అంటున్నారు. సాధారణంగా ఒక దోసె తిందామని వచ్చిన వాళ్లు...ఆపకుండా లాగించేస్తారని అందుకే వ్యాపారం బాగా జరుగుతుందని నర్సమ్మ అంటున్నారు. తాను స్వయంగా తయారు చేసుకునే దోసె పిండి, రుచికరమైన చట్నీలు కారణంగానే కస్టమర్లు తరచూ వస్తుంటారని నర్సమ్మ తెలిపారు.చూసేందుకు చిన్న షెడ్డులో ఉన్న ఈ హోటల్ మధ్యాహ్నం వరకూ కస్టమర్లతో కిటకిటలాడుతుంటుంది.

## ప్రజలు అర్థం చేసుకుని కాస్త టైం ఇవ్వండి

### ఆగస్టు 15 న అన్నక్యాంటీన్లు పున:ప్రారంభం

నెల్లూరు ఆంధ్ర రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా గాడి తప్పిన పరిపాలనను సరైన మార్గంలో పెట్టేందుకు టిడిపి ప్రభుత్వానికి ప్రజలు కాస్త టైం ఇవ్వాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కోరారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 48వ డివిజన్లో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. ఏ సమస్య ఉన్న తనను నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. పెన్షన్ దారులను పేరుపేరునా పలకరిస్తూ ప్రభుత్వం అందజేస్తున్న 4000 రూపాయల పెన్షన్ను వృద్ధులకు, 6000 రూపాయల పెన్షన్ను దివ్యాంగులకు అందజేశారు. జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి 48వ డివిజన్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదును మంత్రి నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ... తనదైన శైలిలో వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలనపై ఘాటుగా విమర్శించారు. గత ప్రభుత్వ నిర్వాహకం వల్ల గాడి తప్పిన పరిపాలనను టిడిపి ప్రభుత్వం వచ్చాక సరిచేస్తున్నామని అయితే ప్రజలు ఇందుకు కాస్త టైం ఇవ్వాలని మంత్రి నారాయణ కోరారు. ఈ క్రమంలో ఇచ్చిన హామీల మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సమర్థవంతగా పరిపాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే పెన్షన్ల పెంపు అని అభివర్ణించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతినెల 1వ తేదీ తెల్లవారుజాము నుండే రాష్ట్రంలో 68 లక్షల 64 వేల మందికి పెన్షన్లు పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. వృద్ధులకు రూ.3వేల నుండి రూ.4 వేలు, దివ్యాంగులకు 3000 నుండి 6000 రూపాయలకు, అత్యధికంగా 15 వేల రూపాయల వరకు పెన్షన్ పెంచి ఇస్తున్నామని చెప్పారు. ఈ విధంగా సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీ చేయడమే కాదు అప్పులు చేసి పెట్టిందని ఘాటుగా విమర్శించారు. దీంతో ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో అప్పులే కనిపిస్తున్నాయని... ప్రభుత్వ భవనాలను సైతం తాకట్టు పెట్టిన దౌర్భాగ్యపు పాలన గత ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో ఆదాయ వనరులు పెరగాలని... పారిశ్రామికంగా అభివృద్ధి జరిగితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని భరోసా ఇచ్చారు. మున్సిపల్ శాఖలోని ప్రజల కట్టిన పన్నులు డబ్బులన్నిటినీ గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు వాడేశారని మండిపడ్డారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్ ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు మురిగిపోయాయన్నారు. 2014 నుండి 2019 వరకు చంద్రబాబు నాయుడు మంత్రులను కేంద్రం నుంచి వచ్చే నిధులు కోసం పరుగులు పెట్టించేవారని తెలియజేశారు. ఆగస్టు మొదటి తారీకు నుండి రాష్ట్రంలో కనీసం 100 అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభిస్తామని చెప్పారు. ఆగస్టు నెలాఖరుకు అంతా 203 అన్నా క్యాంటీన్లను పూర్తిస్థాయిలో పునఃప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు అర్థం చేసుకొని కూటమి ప్రభుత్వానికి కాస్త టైమ్ ఇవ్వాలని మంత్రి నారాయణ కోరారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా గాడి తప్పిన పరిపాలనను గాడిలో పెట్టి సమర్థవంతమైన ప్రజా ప్రభుత్వాన్ని నడుపుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటని నిలబెట్టుకునే ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నారాయణ ప్రశంసించారు.

## మంత్రి నారా లోకేష్ ఓ ఎస్ డి గా బద్వేలు ఆర్డిఓ ఆకుల వెంకటరమణ

బద్వేలు ,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఓ ఎస్ డి గా బద్వేలు ఆర్డిఓ ఆకుల వెంకటరమణ ను నియమించారు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు బద్వేల్ లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటినప్పుడు మొట్టమొదటి ఆర్డీవో గా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు ఆయన గత నెల రోజులుగా సెలవులో ఉన్నారు అప్పటినుంచి బద్వేలు ఇంచార్జ్ ఆర్టీవో గా చంద్రమోహన్ పనిచేస్తున్నారు

## పండితుల పదోన్నతి తేదీ కామన్ గా ఉండాలి- యూటీఎఫ్

బద్వేలుఉన్నతీకరణలో భాగంగా భాషోపాధ్యాయులైన తెలుగు,హిందీ, ఉర్దూ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొంది భిన్న రకాలైన తేదీలలో జాయిన్ అయినట్లుగా నమోదు చేసుకున్నారని దీనిని సవరించి అందరికీ ఒకే తేదీ కామన్ గా ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు.కడప జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పరిపాలనాధికారి మునీర్ ఖాన్ ను కలిసి అందుకు సంబంధించిన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ 2019 నవంబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు భాషోపాధ్యాయులకు ఉన్నతీకరణ పదోన్నతులు కల్పించడమైనదని అయితే పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు నవంబర్ ఒకటవ తేదీ నుండి నాలుగో తేదీ వరకు వివిధ తేదీలలో చేరడం వలన బదిలీల సమయంలోనూ, పదోన్నతుల్లోను కొంతమేర స్పష్టత కొరవడి సీనియార్టీ విషయంలో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.జిల్లా విద్యాశాఖాధికారి ఈ విషయాన్ని పరిశీలించి పదోన్నతి పొందిన పాఠశాల సహాయకులు తెలుగు,హిందీ,ఉర్దూ మరియు వ్యాయామ ఉపాధ్యాయులకు అందరికీ 2019 నవంబర్ ఒకటో తేదీని కామన్ సీనియార్టిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై రవికుమార్ జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్ నాయకులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, యడాల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

కౌతాళం మండల కేద్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కౌతాళం ఎంపీడీవో రఘునాథ్ గుప్తా మరియు సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప , టీడీపీ కౌతాళం టౌన్ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ దారులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రెండో నెల కూడా ఉదయం ఆరు గంటల నుండి ఇంటి దగ్గరికే పింఛన్ పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు.

సంక్షేమం అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు,భీమయ్య,శివ తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లె ఘటనలో మరో ఎనిమిది కేసులు

### ప్రజల్లో ఎవరిని చేర్చారన్న ఉత్కంఠ

మదనపల్లె,ఆగస్ట్1(ఆర్ఎన్ఎ):తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఫైళ్ల దహనం కేసుకు అనుసంధానంగా మరో ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఎనిమిది కేసులు ఏమిటి..? ఎవరి మీద నమోదు చేశారు..? అన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. గతనెల 21వ తేదీ రాత్రి మదనప్లలె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియ్‌సగా తీసుకున్న విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు ఆదేశాలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించిన విషయం విదితమే. దీనిపై సీఐడీ సహకారంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు.ఇదే సమిక్షలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ.. బాధితులు అంత మంది ఉంటారని, సాక్ష్యాధారాలతో తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తారనే విషయాన్ని అస్సలు ఊహించలేదని.. తాను ఇచ్చిన ఒకే ఒక్క సందేశానికి అనూహ్య స్పందన వచ్చిందని చంద్రబాబుకు నిశితంగా వివరించారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఈ మొత్తం ఘటనలో గత ప్రభుత్వంలో వ్యవహరించిన కొందరు పెద్దలు ప్రమేయానికి సంబంధించిన అంశాలన్నీ ముడిపడి ఉన్నాయని ఇప్పుడిప్పుడే తేలుతోంది. అందుకే ఇక ఈ కేసును సీఐడీకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తానికి చూస్తే.. ఈ కేసు అతి త్వరలోనే తేలిపోనుందని మాత్రం చెప్పుకోవచ్చు. ఇదిలా ఉంటే.. ఈ కేసుకు అనుసంధానంగా మరో ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ ఎనిమిది కేసులు ఏమిటి..? ఎవరి మీద నమోదు చేశారు..? అన్న ప్రశ్నలు మదనప్లలె ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈనెల 21వ తేదీ రాత్రి మదనప్లలె సబ్‌కలెక్టరేట్‌లో ౹÷ళ్లె దహనం సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియ్‌సగా తీసుకున్న విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు ఆదేశాలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించిన విషయం విదితమే. దీనిపై సీఐడీ సహకారంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు.ఈ క్రమంలో డీఐజీ ప్రవీణ్ మదనప్లలెలో ఇచ్చిన ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో ఉండకూడని పత్రాలు దొరికినట్లు, ఆయనపై కేసు నమోదు చేశామని చెప్పారు. దీంతో పాటు 52 మందిని విచారించగా, అందులో 15 మంది అనుమానితులను విచారించి సోదాలు చేశామన్నారు. వారి వద్ద ఉండకూడని కీలకపత్రాలు స్వాధీనం చేసుకుని ఎనిమిది కేసులు నమెదు చేశామన్నారు. వాస్తవంగా ఏదైనా నేరం జరిగితే ఆ నేరం చేసిన వ్యక్తులతో పాటు వారికి సహకరించిన, సాక్ష్యాలు, ఆధారాలు చెరిపేందుకు, దాచిపెట్టేందుకు ప్రయత్నించిన వారిపై కూడా కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మదనప్లలె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు, ఈ ఎనిమిది కేసులు కూడా తోడవుతాయనే కొందరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే జరిగితే 15 మంది అనుమానితుల్లో ఎవరిపై ఎనిమిది కేసులు నమోదు చేస్తారో అని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## ఆపొజిషన్ స్టేజ్ లో షర్మిళ



విజయవాడ, ఆగస్టు 1ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి రాజకీయాల్ని ఆయన సోదరి , ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తనకు అనుకూలంగా మార్చుకునే విషయంలో వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నది తాను మాత్రమేనని.. ఏపీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేననని అన్న అభిప్రాయాన్ని కలిగించేలా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ప్రతిపక్ష పార్టీ వైసీపీ నిర్లిప్తత..జగన్ బెంగళూరులోనే ఎక్కువ మకాం పెడుతూండటంతో షర్మిల చురుగ్గా ఆలోచించి రాజకీయా వ్యూహాలను అమలు చేస్తున్నారు. జగన్ అసెంబ్లీకి వెళ్లకూడదన్న నిర్ణయాన్ని మరింత అడ్వాంటేజ్ గా మార్చుకుంటున్నారు. చురుగ్గా ప్రజల్లోకి వెళ్లి వారి తరపున తానే పోరాడుతున్నానన్న అభిప్రాయాన్ని కలిపిస్తున్నారు. ఎన్నికల్లో ఘోరమైన పరాజయం తర్వాత జగన్ ఇంకా తప్పటడుగులే వేస్తున్నారన్న అభిప్రాయంతో వైసీపీ క్యాడరే కాదు ఇతర రాజకీయ పార్టీలు కూడా ఉన్నాయి. అందులో మొదటిది అసెంబ్లీకి వెళ్లకపోవడం. అసెంబ్లీలో ఎవరు అవునన్నా.. కాదన్న ఆయన ప్రతిపక్ష నేతనే. కూటమికి వ్యతిరేకంగా తమ పార్టీ తప్ప మరో పార్టీ లేదని అందుకే తమదే ప్రతిపక్షమని ఆయన అంటున్నారు. ఆ విషయాన్ని టీడీపీ కూడా కాదనడం లేదు. కానీ ప్రధాన ప్రతిపక్ష హోదాను మాత్రం ఇవ్వలేదు. అందుకు పదిశాతం సీట్లు రావాలన్న రూల్ ఉందని టీడీపీ ప్రభుత్వం చెబుతోంది. పార్లమెంట్ లో గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రధాన ప్రతిపక్షహోదా ఈ కారణంతోనే ఇవ్వలేదు. కానీ ప్రతిపక్షంగా గుర్తింపు పొంది పోరాడుతూనే ఉంది. కానీ అలాంటి ప్రతిపక్షంగా పోరాడటానికి జగన్ సిద్దంగా లేరు. నకు హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని.. తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రారని ఆయన తేల్చి చెప్పారు. దాంతో అసెంబ్లీలో ప్రతిపక్షమే కనిపించలేదు. కనీసం అసెంబ్లీకి వెళ్లి ఉంటే.. మాట్లాడటానికి చాన్సివ్వకపోతే.. అదే విషయాన్ని ప్రజలకు చెప్పే అవకాశం ఉంటుంది. కానీ అసలు వెళ్లకపోతే.. అలా చెప్పడానికి కూడా అవకాశం ఉండదు. అసెంబ్లీకి వెళ్లేందుకు సిద్ధపడని జగన్మోహన్ రెడ్డి .. ప్రభుత్వంపై పోరాటాన్ని పార్టీ కోణలోనే చేస్తున్నారు కానీ.. సాధారణ ప్రజల దిశగా వెళ్లడం లేదు. వినుకొండలో జరిగిన హత్యా ఉదంతంతో ఢిల్లీలో ధర్నా చేశారు. తమ పార్టీ నేతలపై హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. ఎంత మంది హత్యకు గురయ్యారో వారి వివరాలు ఇవ్వాలని మీడియాతో పాటు టీడీపీ ప్రభుత్వం అడిగినా స్పందించలేదు. అదే? సమయంలో.. శ్వేతపత్రాల పేరుతో తమ పై బురద చల్లుతున్నారని ఆరోపించారు. ఈ పోరాటం అంతా పార్టీ కోణంలోనే జరుగుతోంది కానీ..ప్రజా సమస్యలపై ఇంకా దృష్టి పెట్టలేదు. ఇక్కడే షర్మిల అడ్వాంటేజ్ తీసుకున్నారు. షర్మిల వర్షాకాలం కారణంగా వచ్చిన వరదలతో మునిగిన పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి గూడెంలో షర్మిల నడుంలోతు నీళ్లు ఉన్న పొలంలోకి దిగి..అందర్నీ ఆశ్చర్యపరిచారు. రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలెవరూ రైతులను పట్టించుకోలేదు. వరద బాధితుల గురించి ఆలోచించలేదు. చిన్న ప్రకటన కూడా చేయలేదు. ఓ వైపు ప్రతిపక్ష పాత్రను నిర్వర్తించడానికి మొహమాట పడుతున్న వైసీపీని మరంతగా కార్నర్ చేస్తూ.. తానే ప్రభుత్వంపై పోరాటానికి ముందుకు వస్తున్నారు. ఇది వైసీపీకి ఇబ్బందికరంగా మారుతోంది. ప్రజల తరపున పోరాటంలో షర్మిల ముందుకెళ్తే.. వైసీపీకి మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే సరైన సమయంలో జగన్ బయటకు వస్తారని ఆ తర్వాత షర్మిలను ఎవరూ పట్టించుకోరని అనుకుంటున్నారు.మొత్తంగా షర్మిల, జగన్ మధ్య ప్రతిపక్ష నేతగా ప్రజల్లో గుర్తింపు కోసం హోరాహోరీ పోరు సాగుతోందని అనుకోవచ్చు. మరి ఎవరిది పైచేయి అవుతుందో ?

## చిక్కుల్లో మేయర్...

### చక్రం తిప్పుతున్న టీడీపీ

నెల్లూరు, ఆగస్టు1 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫోర్జరీ కేసు ఉచ్చు మేయర్ మెడకు బిగుసుకుంటుంది. ఈ కేసు నుంచి బయట పడేందుకు చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతుండటంతో వైసీపీ శ్రేణులు తెగ టెన్షన్ పడుతున్నాయి. మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యం, నగర మేయర్ వేసిన అడుగులు వెరసి ఆమెకు అన్ని దారులు మూతపడేలా చేసాయంటున్నారు ..దీంతో రాష్ట్ర వ్యాప్తంగాను ఈ కేసు పై చర్చ సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పెద్దలు తీసుకునే నిర్ణయం పై నగర మేయర్ భవితవ్యం ఆధారపడి ఉండటం ఆసక్తి రేపుతోంది.నెల్లూరు నగర పరిధిలో మార్టిగేజ్ రిలీజ్ వ్యవహారంలో పెద్ద తంతే నడిచింది. వారి జేబులు నింపుకునేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కారు. అధికారంలో ఉన్న పార్టీల నేతలు వైసీపీ నేతలు శృతిమించి వ్యవహారం నడిపించారు. నగర కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేసి దందాలకు పాల్పడ్డారు.. ఆ విషయం బయటపడటంతో వివాదం ముదిరింది విమర్శలు పెరిగాయి. ఏకంగా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.ఓ న్యాయవాది కమిషనర్ కి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. కమిషనర్ విచారణ చేసి తన సంతకాలను ఫోర్జరీ చేసినట్టు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయం అనేక మందికి తెలిసినా స్వయంగా కమిషనర్ ఫిర్యాదు చేసే వరకు పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. నగర కమిషనర్ ఫిర్యాదుతో ఇప్పటికే ఏడుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో వారిని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు మొదలుపెట్టారు. అందరూ ఫోన్ స్విచాఫ్ చేసి మరీ గాయబ్ అయిపోయారు ..ఆ ఎపిసోడ్ బయటపడ్డ తర్వాత మేయర్ స్రవంతి పరిస్థితి దయనీయంగా మారింది. కార్పొరేషన్ లో ఆమె మాట చెల్లుబాటు అవ్వడం లేదు. ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ పరిణామాలతో ఆమె రాజీనామా చేస్తారా? లేకపోతే ఆ పోర్జరీ ఎపిసోడ్‌లో కీరోల్ పోషించినట్లు ప్రచారం జరుగుతున్న భర్త జయవర్ధన్‌ను కాపాడుకోవడానికి ఏం చేయబోతున్నారన్నది చర్చల్లో నలుగుతుంది. దీనికి సంబంధించి మేయర్‌పై చట్టపరమైన చర్యలు ఉండకపోయినా.. పరిపాలనపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు.మార్ట్ గేజ్ రిలీజ్ కోసం జరిపిన పైరవీల్లో అనేకమంది వ్యాపారుల నుంచి లక్షలాది రూపాయలను నగర మేయర్ పొట్లూరి స్రవంతి, భర్త జయవర్ధన్ వెనకేసుకున్నారన్న వాదన బలంగా వినిపిస్తుంది. మేయర్ స్రవంతి అప్పట్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అండతో పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనుచరులుగా వ్యవహరిస్తూ వచ్చారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎన్నికలకు దాదాపు ఏడాది ముందు ప్రభుత్వంపై వ్యతిరేక స్వరం వినిపించారు. వైసీపీకి దూరం అయ్యారు.కోటంరెడ్డి ఆశీస్సులతో మేయర్ అయిన స్రవంతి ఆమె భర్తలు ఆ టైంలో చచ్చే వరకు తమ వెంట కోటంరెడ్డి వెంటేనని భారీ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అయితే ఎన్నికల టైంకి తిరిగి ప్లేట్ మార్చి వైసీపీకే ఫిక్స్ అయ్యారు. అప్పుడే వారు పోర్జరీల ఎపిసోడ్‌ని మరింత స్పీడ్‌గా నడిపించారంట.. అప్పుడు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌పై పోటీ చేసినప్పుడు మేయర్ కపుల్ వైసీపీ తరపున హడావుడి చేశారు.ప్రస్తుతం ఆమె కేసు మరింత జటిలం కావడానికి ఇదో కారణంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి ఆమె వైసీపీలోనే కొనసాగారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ పంచన చేరదామన్నా సాధ్యపడలేదు. గత నెలలో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించింది. చేసిన తప్పును క్షమించి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తమను ఆదరిస్తారని భావిస్తున్నామని మేయర్ స్రవంతి దంపతులు బహిరంగంగా వేడుకున్నా.. ఆయనందుకు నిరాకరించారు.ప్రస్తుతం ఈ కేసులో ఏడు మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దీంతో మేయర్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాదు అనుకుని వైసీపీలోనే కొనసాగటం వైసీపీ ఓటమి పాలయ్యాక తెలుగుదేశం పార్టీ పంచన చేరే ప్రయత్నం చేయడంతో రెండు పార్టీలకు ఆమెకు దూరమైనట్లు అయ్యింది. ఆ క్రమంలోఈ కేసు నుంచి బయట పడేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.చివరిగా రాష్ట్ర మంత్రి నారాయణను కలిసి తనను ఈ కేసు నుంచి బయటపడేలా చూడాలని విజ్ఞప్తి చేసే పనిలో ఆమె బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అందుకు కోటంరెడ్డిని కాదని నారాయణ వారికి సహకరించే పరిస్థితి లేదంటున్నారు. అధికార కూటమి ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. చాలా ఏళ్ల తర్వాత నెల్లూరు మేయర్ పదవి ఎస్టీకి రిజర్వ్ అయింది. దీంతో కోటంరెడ్డి అనుచరుడైన జయవర్ధన్ భార్య స్రవంతి మేయర్ గా అవకాశం దక్కించుకున్నారు.ప్రస్తుతం డిప్యూటీ మేయర్లుగా టీడీపీ నేత రూప్ కుమార్ యాదవ్, ఖలీల్ అహ్మద్ ఉన్నారు. నెల్లూరు సిటీ సెగ్మెంట్లో మంత్రి నారాయణ చేతిలో పరాజయం పాలైన ఖలీల్ అహ్మద్‌కు మేయర్ పదవి ఇచ్చే పరిస్థితి లేదు. ఇక మిగిలింది రూప్ కుమార్ యాదవ్.. అయితే ఎస్టీ రిజర్వుడు కావడంతో ఆ పదవి రూప్‌కుమార్‌కు దక్కే పరిస్థితి లేదు. దాంతో మేయర్ స్రవంతిలను సెలవు పై వెళ్లేలా చేసి ఇంచార్జ్ మేయర్‌గా రూప్‌కుమార్‌యాదవ్‌ను కొనసాగించే అవకాశం ఉంది.

## ఎన్నికల రాజకీయాల్లో బీజేపీకి భంగపాటు తప్పదు : కాంగ్రెస్




హైదరాబాద్, ఆగస్టు 1 కులంపై బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తప్పుపట్టారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఇటీవల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కులం గురించి మాట్లాడటం కలకలం రేపిన విషయం తెలిసిందే. అనురాగ్ ఠాకూర్ జనరల్ క్యాటగిరీకి చెందిన వారని, కులం గురించి మాట్లాడే విషయంలో ఆయన సంయమనంతో వ్యవహరించాలని హితవు పలికారు. కొద్దిరోజుల కిందట బీజేపీ షాపులకు యజమానుల పేర్లు వెల్లడించే నేమ్‌ప్లేట్లు ఉండాలని డిమాండ్ చేసిందని, అప్పుడు కూడా తాము ఈ ప్రతిపాదనపై అభ్యంతరం తెలిపామని సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు.భారత్‌లో పేరు కులాన్ని వెల్లడించేలా ఉంటుందని అందుకే తాము ఈ ప్రతిపాదనను వ్యతిరేకించామని చెప్పారు. ఏ ఒక్కరి కులం గురించి అడగడం తప్పని స్పష్టం చేశారు. మీరు అగ్ర కులానికి చెందిన (అనురాగ్ ఠాకూర్) వ్యక్తి కాబట్టి ఇది మీ అహంకారాన్ని సూచిస్తోందని అన్నారు. ఈ అహంకారాన్ని భారత్ సహించదని పేర్కొన్నారు. అనురాగ్ ఠాకూర్, బీజేపీ ఈ అహంకారానికి ఎన్నికల రాజకీయాల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు.కాగా తన కులం ఏంటో తెలియని వ్యక్తి కుల గణన గురించి మాట్లాడుతున్నారని రాహుల్ గాంధీని ఉద్దేశించి లోక్‌సభలో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు పెనుదుమారం రేపిన సంగతి తెలిసిందే. కులం గురించి మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని, ఒకరి కులాన్ని గురించి ప్రశ్నించే హక్కు అనురాగ్ ఠాకూర్ సహా ఏ ఒక్కరికీ లేదని, ఇది రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని విపక్ష నేతలు కాషాయ పాలకులపై విరుచుకుపడ్డారు.

## 12 వేల కోట్లకు చేరిన అప్పులు

విజయవాడ, ఆగస్టు 1, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ రూ.3 వేల రూపాయలు అప్పుడు కోట్ల అప్పు చేసింది. రిజర్వు బ్యాంకులో నిర్వహించిన సెక్యూరిటీ వేలంలో బాండ్లను ప్రభుత్వం విక్రయించి రూ. 3 వేల కోట్లను సమీకరించుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మంగళవారం అప్పులు చేస్తూ వస్తోంది. తాజాగా తెచ్చిన అప్పుతో అధికారంలోకి వచ్చిన రెండు నెలలు కూడా గడవక ముందే మొత్తం అప్పుడు రూ. 12 వేల కోట్లకు చేరినట్లయింది. మొట్టమొదటి సారి జూన్ 25న రూ. 2 వేల కోట్లు, జూలై 2న రూ. 5 వేల కోట్లు, జూలై 16న మరో రూ. 2 వేల కోట్లు చంద్రబాబు ప్రభుత్వం అప్పుల రూపంలో తెచ్చింది. గతంలో 2019-24 మధ్య ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఉన్నప్పుడు జగన్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేశాడని విమర్శించేవారు.అందుకు అనుగుణంగానే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అప్పుల భారాన్ని రూ. 9.74 లక్షల కోట్లకు పెంచుకుంటూ పోయారని ఎద్దేవా చేశారు. వాటిని సరిచేయాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలు కూడా ఆలోచన చేయాల్సి ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించేందుకే శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి చేస్తున్న అప్పులపై వైసీపీ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కేవలం రెండు నెలలు కూడా గడవకముందే రూ. 12 వేల కోట్లు అప్పులు చేయడంపై విస్మయం వ్యక్తం చేస్తోంది. మేం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చారని ఆరోపణలు చేసి, ఇప్పుడు తమరు చేస్తున్నదేమిటని ప్రశ్నిస్తున్నారు. మాకన్నా రెండింతలు ఖర్చయ్యే సంక్షేమ పథకాలు అమలు చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, సంపద సృష్టిస్తానని చెప్పుకొచ్చాడు. ఇదే సంపద సృష్టించడం అంటే అని విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీ తప్ప మరే ఇతర సంక్షేమ పథకం కూడా అమలుకు నోచుకోలేదు. వారు గొప్పగా ప్రచారం చేసుకున్న సూపర్ 6 లోని తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ. 1500, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, రైతులకు ఏడాదికి రూ. 20 వేలు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు వంటి ఏ పథకం కూడా అమలుకు నోచుకోలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం పైనా వైసీపీ అనుమానాలు వ్యక్తం చేసింది. వారు చేస్తున్న రుణాలను కనపడకుండా చేయడానికి జరుగుతున్న ప్రయత్నమేనని విమర్శిస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ ఏడాది పాటు పథకాల అమలుపై కింది స్థాయి వరకు కూలంకషంగా చర్చించి, అందరికీ న్యాయం చేసే విధంగా పథకాలను ఏడాది తర్వాత అమలు చేస్తామని చెప్పారు. లోకేశ్ ప్రకటనతో లబ్దిదారులు అయోమయంలో పడిపోయారు. తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15వేల చొప్పున ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు హామీ ఇచ్చింది. ఇప్పుడు వారంతా లోకేశ్ ప్రకటనతో ఉసూరుమంటున్నారు. 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీపై మరో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి అమలు చేయడం లేదని అసెంబ్లీలో చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకానుందని సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన శ్రేణులు ప్రచారం చేసుకున్నా, ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పష్టమైన హామీ మాత్రం రాలేదు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ మాట్లాడుతూ బ్లీచింగ్ పౌడర్ కొనడానికి కూడా ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెబుతున్నారు. నా ఆఫీసర్ ఫర్నీచర్ కూడా సొంత డబ్బులతోనే తెచ్చుకుంటానని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సమస్యల నేపథ్యంలో పథకాలు అమలు జరగడంపైనే రకరకాల అనుమానాలు తలెత్తుతున్నాయి. మరోవైపు అమరావతి నిర్మాణం గురించి కూడా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద స్తోమత లేదని సెలవిచ్చారు. మరోవైపు కేంద్రం అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు వివిధ బ్యాంకుల ద్వారా సమీకరించి అప్పుగా ఇస్తామని బడ్జెట్ సందర్భంగా ప్రకటించింది.

## పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వడ్డు లక్ష్మి దేవమ్మ



శ్రీ ప్రస్థానం- గడివేముల, ఆగస్టు 1:- పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు గడివేముల మండల పరిధిలోని పెసర వాయి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు కీర్తిశేషులు వడ్డు ప్రతాప్ రెడ్డి భార్య టి.డి.పి నాయకురాలు వడ్డు లక్ష్మీదేవమ్మ గురువారము పెన్షన్ పంపిణీ కార్యక్రమంచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లే వృద్దులకు బ్రతుకుదెరువు: పంటా రామచంద్రా రెడ్డి



శ్రీ ప్రస్థానం- గడివేముల, ఆగస్టు 1: పెన్షన్లే వృద్దులకు బ్రతుకుదెరువు, అందుకే వాటిని తెల్లవారగానే పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి అదేశించారని గడివేముల మండల సీనియర్ నాయకులు పంట రామచంద్రా రెడ్డి అన్నారు. గడివేముల మండల పరిధిలోని బూజనూరు గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు పంట రామచంద్రా రెడ్డి, గ్రంథివేముల గ్రామంలో యస్.వి రామ మోహన్ రెడ్డి గురువారము పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ దారులపై 'ఒక్కరోజే' పిడుగు



శ్రీ ప్రస్థానం-గడివేముల:- ఆగస్టు 2:- అధికారంలోకి రాగానే పెంచిన పింఛన్ ఇస్తామంటూ ఊరూరా ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం పీఠంపై కూర్చున్నాక పింఛన్ ఎగవేతకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పింఛన్ పంపిణీ 'ఒక్కరోజే' అంటూ కూటమి ప్రభుత్వం మెలిక పెట్టింది .దీన్నిబట్టి చూస్తే పెంచిన మొత్తం ఇవ్వలేక.. ప్రతి నెలా కొంతమందిని కోత వేసేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే పింఛన్‌ల పంపిణీపైఆంక్షలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదు రోజుల పాటు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే పింఛన్ అందజేసేదని, ఇప్పుడూ అదే విధానం కొనసాగించాలని పెన్షన్ దారులు కోరుతున్నారు.

## భక్తి శ్రద్ధలతో "హజరత్ హుస్సేన్ వలి" కి ప్రత్యేక పూజలు..

కోవెల కుంట్ల, ఆగస్టు:01, శ్రీ ప్రస్థానం న్యూస్:- నంద్యాల జిల్లా, కోవెలకుంట్ల మండలం, రేవనూరు గ్రామాల్లో వెలసిన 500 సం" లు చరిత్ర కలిగిన న రేవనూర్ "హాజరత్ హుస్సేన్ వలి" కి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.. రేవనుర్ హజరత్ హుస్సేన్ వలి" దర్గాను దర్శించు కునేందుకు ప్రతి గురువారము ఉమ్మడి రాష్ట్రంలో ఏ.పి. తెలంగాణ కు చెందిన నలుమూల నుండి కులామతాలకు అతీతంగా వేల సంఖ్య లో భక్తులు ఈ దర్గా ను దర్శిస్తూ ఉంటారు.. గురువారము దర్గా మూత వలి ముళ్ల గఫార్, మీడియాతో మాట్లాడుతూ వందల సం చరిత్ర కల్గిన ఈ హుసైన్ వలి స్వామి దర్గా భక్తులకు కోరికలు తిర్చే విదంగా ఉందని దర్గా కు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నుండి వేల సంఖ్య లో భక్తులు వస్తారని అన్నారు. దర్గాకు వచ్చే భక్తులకు సౌకర్యాలు గతంలో తక్కువ ఉండేవని దాతల సహకారం తో సౌకర్యలు మెరుగు పరిచమన్నారు. ఈ దర్గా రాష్ట్ర వక్ష్ బోర్డు పరిధి లో ఉందన్నారు.. దర్గా అభి వృద్ధికి సహకరించే దాతలు ముత వలి (దర్గా ధర్మ కర్త )ను సంప్రదించాలని కోరారు..



## "పుట్టిన పిల్లలు తల్లి పాలు తాగడం వారి హక్కు"



నంద్యాల కందనవోలు ఆగస్టు 1 రామకృష్ణ అటానమ స్ డిగ్రీ కళాశాలలో ఈరోజు అనగా ఈరోజు ×"ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా కంప్యూటర్స్ విభాగం వారు ఏర్పాటు చేసిన సదస్సుకు నంద్యాల పట్టణ ఐఎంఏ అధ్యక్షురాలు సుమిత్ర హాస్పిటల్ డాక్టర్ ×వసుధా రాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల చైర్మన్ ఆచార్యులు డాక్టర్ జి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ×డాక్టర్ వసుధారాణి మాట్లాడుతూ పిల్లలకు తల్లి పాలు పట్టడం కొంత అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పుట్టిన పిల్లలు తల్లి పాలు తాగడం వారి హక్కు అని తల్లి పిల్లలకు పాలు పట్టడంలో ఎలాంటి అపోహలు పెట్టుకోకూడదు. పిల్లలు పుట్టిన వెంటనే తల్లి పిల్లలకు పాలు పట్టాలి కొంత అవగాహన లోపం వలన పుట్టిన తర్వాత ముర్రుపాలని ఆ పాలు పిల్లలకు పట్టరు కానీ ముర్రుపాలలో అనేక పోషక విలువలు ఉంటాయని అన్నారు. పిల్లలు తల్లిపాలు తాగడం వలన వారికి వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఐరన్, విటమిన్స్ ఎక్కువగా లభిస్తాయని తల్లిపాలలో దాదాపుగా 80% నీరు ఉంటాయని ఆ నీరు కూడా పిల్లలకు అవసరమని కాబట్టి కచ్చితంగా తల్లులు పుట్టిన పిల్లలకు సంవత్సరం వరకు పాలు పట్టాలని అన్నారు ఆరు నెలల వరకు మాత్రము కచ్చితంగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఏడవ నెల నుండి తల్లిపాలతో పాటు కొంత ఇతర ఆహార పదార్థాలు పిల్లలకు పెట్టవచ్చని అన్నారు. తల్లిపాలు తాగడం వలన పిల్లలలో పెరుగుదల కూడా ఎక్కువగా ఉంటుందని తల్లి బిడ్డల మధ్య ప్రేమ వాత్సల్యం మమకారం పెరుగుతాయని తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని అన్నారు అంతే కాకుండా పాలు పట్టే సమయంలో తర్వాత ప్రెగ్నెన్సీ వచ్చే అవకాశాలు కొంత తగ్గుతాయని అన్నారు అయితే తల్లిపాలు పట్టే తల్లులు కూడా మంచి ఆహారము తీసుకోవాలని ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని పిల్లలకు పాలు పట్టే సమయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తల్లులు డాక్టర్లను సంప్రదిస్తే తగిన నివారణ తెలియజేసి మందులు ఇస్తారు అని అన్నారు. అయితే తల్లులకు బాగోలేనప్పుడు టీబి ఎయిడ్స్ వంటి అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు పాలు పట్టరాదు డాక్టర్లను సంప్రదించి సలహాలను పాటించాలి పట్టణ ప్రాంతాలలో తల్లులు పాలు పట్టడానికి కొంత సంకోచిస్తున్నారని కొన్ని అపోహలు ఉన్నాయని అన్నారు అవి కేవలం అపోహలు మాత్రమే కాబట్టి పుట్టిన బిడ్డలకు తల్లులు పాలు ఇవ్వాలని ఈ అవగాహన ప్రజలలో కలిగించాలని దాదాపు ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు ఒకటి నుండి ఏడో తారీఖు వరకు తల్లిపాల వారోత్సవాలు జరుపుతున్నారని అలాగే నంద్యాల పట్టణ డాక్టర్ల అసోసియేషన్ కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని డాక్టర్ వసుధ రాణి అన్నారు.కళాశాల చైర్మన్ ఆచార్యులు డాక్టర్ జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలోని విద్యార్థినులకు అవగాహన కలిగించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు కాబట్టి కళాశాల విద్యార్థులు వీటి పైన అపోహాలు తొలగించుకొని ఏవైనా సందేహాలు ఉంటే డాక్టర్ వసుధ రాణి ని అడిగి తెలుసుకోవాలని అన్నారు ఇదివరకు ఎలాంటి ఆలోచనలు లేకుండా అందరూ తల్లులు పిల్లలకు పాలు పట్టేవారు . కానీ స్త్రీలు బాగా చదువుకున్న తర్వాత ఉద్యోగ నిర్వహణలో తల్లులు పిల్లలకు పాలు పట్టే సమయం లేకుండా పోతుందని అనేక కారణాల వల్ల పిల్లలు తల్లిపాలకు దూరమై వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి అనారోగ్యం పాలవుతున్నారని అందుకనే తల్లిపాల వారోత్సవాలు అని ఇలాంటి కార్యక్రమాల వలన మళ్లీ అవగాహన చైతన్యం కలిగించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది అని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య మాట్లాడుతూ మదర్ ఫీడింగ్ లో అపోహల నివారించి పిల్లల ఆరోగ్య ఎదుగుదలకు పాటుపడాలని తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని వారి అనుబంధం కొనసాగాలని ఆ విధముగా విద్యార్థులలో అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు తల్లిపాలపై ,తల్లి బిడ్డల ఆరోగ్యంపై అనేక విషయాలపై అవగాహన కలిగించారు. కళాశాల మేనేజర్ శ్రీమతి ప్రగతి రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం వలన విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఆ ఉద్దేశం తో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాను కాబట్టి విద్యార్థులు డాక్టర్ చెప్పే విషయాలను జాగ్రత్తగా వినాలని సందేహాలు ఉంటే అడగాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం డాక్టర్ వసుధారణిని ఘనంగా మెమెంటో శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ విభాగం అధిపతి డాక్టర్ కుమార్, సంపత్ కుమార్, కంప్యూటర్ విభాగం అధ్యాపకులు కళాశాల విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## సాంకేతికతను వినియోగించి కిడ్నాప్ కేసును 10 గంటల్లో చేధించిన గూడూరు పోలీసులు.?

అభినందించిన ... జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

కర్నూలు ఆగస్టు :01కిడ్నాపర్ల నుంచి బంగారు వ్యాపారి వెంకటేశ్వర్లును గూడురు పోలీసులు రక్షించారు. గూడూరు పోలీసు స్టేషన్ లో కిడ్నాప్ కేసు నమోదు కావడం జరిగింది. మంగళవారం ఉదయమే చేధించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు 4 పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగరాజ్ యాదవ్, గోనెగండ్ల సిఐ రామకృష్ణ, ఎమ్మిగనూరు టౌన్ సిఐ మధుసూధన్ రావు, కర్నూలు నాల్గవ పట్టణ సిఐ శంకరయ్య , సైబర్ సెల్ సిఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో గూడూరు, కోడుమూరు, కె. నాగలా పురం ఎస్సైలతో పాటు పోలీసు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.సీసీ టీవీ పుటేజి, చరవాణి నంబర్ లోకేషన్ వంటి సాంకేతికను వినియోగించి కేసును ఛేదించారు. మంగళవారం ప్యాలకుర్తి సమీపంలో కిడ్నాపర్ల నుండి బంగారం వ్యాపారి వెంకటేశ్వర్లను రక్షించి , కుటంబ సభ్యులకు అప్పగిం చారు. కిడ్నాప్ కు గురైన బంగారం వ్యాపారి వెంకటేశ్వర్లు, గూడురు మండలం కు చెందిన బంగారం వ్యాపారస్తులు, గూడూరు ప్రజలు గురువారం జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి త్వరితగతిన చర్యలు తీసుకుని , కేసు ను చేధించి , ప్రాణాలు కాపాడినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. డబ్బుల కోసమే కిడ్నాప్ చేశారనే విషయం పై దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.కిడ్నాప్ కేసును చేధించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ గురువారం అభినందించారు. ఈ సంఘటనతో గూడురు మండలం కు చెందిన బంగారం వ్యాపారస్తులు, గూడూరు ప్రజలు శభాష్ పోలీసు అంటూ పోలీసుల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తో ఆనందంతో సంబరాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు.



నందికొట్కూరు := ఎస్సీఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు సంచలన తీరిపించింది వర్గీకరణ సమర్ధనీయమని దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కలిపిస్తూ ఆదేశాలు జారీ చేసింది విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్ల కోసం వర్గీకరణ ఎస్సీ ఎస్టీ సవరణ అవసరమని జస్టిస్ చంద్ర చూడ్ నేతృత్వంలోని 7 సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తిలో తీర్పు వెలువరించింది. గౌరవనీయులు శ్రీ మందా కృష్ణ మాదిగ గారి 30 సంవత్సరాల కళ ఈ తీర్పుతో నెరవేరింది. దీనిలో భాగంగా నందికొట్కూరులో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు కలిసి భారీ ర్యాలీతో ఆనందం లో కేకులు కట్ చేసి గౌరవనీయులు శ్రీ మందకృష్ణ మాదిగ అన్న గారికి పాలాభిషేకం చేసి టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎమ్మెస్ పి అధికార ప్రతినిధి కోట ప్రభాకర్ మాదిగ గారు మాట్లాడుతూ ఈరోజు ప్రతి మాదిగ బిడ్డ గర్వించదగ్గ శుభదినం అని మాదిగల 30 సంవత్సరాల కళ నెరవేరిన రోజు అని ఈ వర్గీకరణ కోసం పోరాడిన ప్రతి నాయకుడికి కార్యకర్తలకి నా ధన్యవాదాలు అని తెలుపుతూ ఈ వర్గీకరణ కోసం అమరులైనటువంటి ప్రతి మాదిగ బిడ్డల వీరమరణం ఊరికనే పోలేదు ఏబిసిడి వర్గీకరణ విజయం రూపంలో తిరిగి వచ్చిందని హర్షము వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పి దేవన్న మాదిగ, బి ఈశ్వరయ్య మాదిగ, ప్రేమ రాజు మాదిగ, బాల యేసు మాదిగ విజ్జి మాదిగ, ప్రసాద్ మాదిగ జీవ రత్నం మాదిగ పురుషోత్తం మాదిగ నందికొట్కూరు ఎం ఎస్ పి మండల అధ్యక్షులు బి ప్రకాశం మాదిగ, పాములపాడు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బి మోహన్ మాదిగ, మిడ్తూరు మండలం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బి సతీష్ మాదిగ,పగిడాల మండలం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈ మహేష్ మాదిగ నందికొట్కూరు తాలూకా ఎంఆర్పిఎస్ యువ నాయకులు ఎం శేఖర్ మాదిగ, కే కుమార్ మాదిగ, మరియు నందికొట్కూరు ఏబీమ్ పాలెం ఎమ్మార్పీఎస్ నాయకులు జాన్ మాదిగ, పాపన్న మాదిగ, రాజన్న మాదిగ, ప్రవీణ్ మాదిగ, శివ ప్రసాద్ మాదిగ, తిమోతి మాదిగ, గిద్యోన్ మాదిగ, సుమంత్ మాదిగ, దావీదు మాదిగ జనసేన నాయకులు వెంకటేష్ మాదిగ మరియు కార్యకర్తలుసాములు మాదిగ, విజయుడు మాదిగ, నాగభూషణం మాదిగ, రత్నమయ్య మాదిగ, చిన్న రత్నం మాదిగ మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనందంతో సంబరాలు చేశారు.



## గంట వ్యవధిలోనే 82 శాతం పించన్ల పంపిణీ..





దొర్ని పాడు, ఆగస్టు:01, శ్రీ ప్రస్థానం న్యూస్ :- మండలంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ఎన్ టీ ఆర్.భరోసా సామజిక పింఛన్ల పథకం కింద వివిధ కేటగిరీల చెందిన లబ్ది దారుల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయం సిబ్బందిచే గంట వ్యవధిలోనే 82 శాతం పైగా పంపిణీ చేశారు..ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, భూమా అఖిల ప్రియ, ఆదేశాల మేరకు మండల మాజీ మండలా ధ్యక్ష్యులు భూమా బ్రహ్మానంద రెడ్డి, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల టిడిపి నాయకులు సచివాలయం సిబ్బంది తో కలసి గురువారం వేకువ జామునే ఉదయం 6.00 గంటలకు ప్రారంభించగా 7 గంటలు అయ్యే సరికి 82 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యింది.. కేవలం ఒక గంట వ్యవధిలోనే 82 శాతం పైగా పింఛన్ల పంపిణీనీ పూర్తి చేయడం జరిగిందన్నారు.. గత వైసిపి ప్రభుత్వంలో పించన్లను పంపిణీ చేసిన వాలంట్రీ ల కంటే మెరుగ్గా సచివాలయం సిబ్బంది వేకువజా మునే పించన్ లబ్ది దారుల ఇంటి తలుపులు తట్టర్చి నిద్రలేపి పింఛన్లను పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించడం జరిగిందని చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ టిడిపి నాయకులు జీ. కాశీ విశ్వనాథ్ రెడ్డి, ఎం.దయనదరావు,పంచాయతి కార్యదర్శి,లు సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు..

## నూతన తహాశీల్దార్ చంద్రశేఖర్ వర్మ



వెల్దుర్తి ఆగస్టు 01 న్యూస్:వెల్దుర్తి మండల నూతన తహాశీల్దారుగా చంద్రశేఖర్ వర్మను నియమించారు గత సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల జిల్లా,ప్యాపిలి మండలం తహాశీల్దారుగా పనిచేసిన చంద్రశేఖర్‌వర్మను ఎన్నికల ముందు వైయస్సార్ జిల్లాకు బదిలీచేయడం జరిగినట్లు సమాచారం. వైయస్సార్ జిల్లా నుండివెల్దుర్తి మండల తహాశీల్దారుగా నియమించినట్లు చంద్రశేఖర్ వర్మ తెలిపారు ఈ సందర్భంగా ఆయన రైతు సమస్యలు ఉంటే నేరుగా వచ్చి సమస్యలను పరిష్కారం చేసుకోవాలని తెలిపారు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ ధనుంజయ రెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, మస్తాన్, వీఆర్వోల అసోసియేషన్ మండల ప్రెసిడెంట్ బి వి, రమణ రెడ్డి,ఎల్ల కృష్ణ, రామకృష్ణ, ప్రసాద్ బాబు, జయేంద్ర, వాణి, పద్మ, ఉమ్మన్న, ప్రతాప్, అయ్యన్న, కెకె మద్దిలేటి, మౌలాలి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు,

## పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవోశివశంకరప్ప

వెల్దుర్తి కందనవోలు ఆగస్టు 01న్యూస్:మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో గురువారం రోజు ఉదయం 5 గంటలకు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రజా పరిషత్ డెవలప్మెంట్ అధికారి శివ శంకరప్ప హాజరయ్యారు అనంతరం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని అస్మాత్తుగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఉదయం 5 గంటల నుంచి పంపిణీ చేసినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో నరసాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి రహింతుల్లా, వెల్ఫేర్ అసిస్టెంట్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757